# పరిష్కారమేమిటి?

- పి.వి.పి. మృత్యుంజయరావు

'నల్లమల ఎక్స్‌ప్రెస్' రాత్రంతా పరుగెడుతునే వుంది. శీతాకాలపు చలిగాలులు రివ్వున వీస్తున్నాయి. బయట దృశ్యాలు చీకటిలో కనిపించకపోవడంతో ఉన్న కొద్దిమంది ప్రయాణీకులు నిద్రకు జోగుతున్నారు. హైద్రాబాదు ఎప్పుడొస్తుందా అని ఆదుర్దాతో వున్నారు. సంసారాన్ని బిడ్డల్ని వదలి ఆఫీసుడ్యూటీ మీద చాలాకాలం బయట వూళ్ళో పనిచేసి వస్తున్న రామారావుకు ప్రయాణం బోరుకొట్టటములేదు. ఇంటికి వెళ్ళగానే 'కిట్టుగాణ్ణి' ఎగరేసి ముద్దుపెట్టుకోవాలని, వాడి చిరునవ్వులు చూడాలనే ఉత్కంఠ అతనికి నిద్ర పట్టకుండా చేసింది. దూరంగా దిక్చక్రము వద్ద కనిపించే దీపాల సమూహము ఒక మహానగర సామీప్యాన్ని సూచిస్తున్నాయి. జనసంచారములేని ప్రదేశాలనుదాటి బస్సు నగరంలో ప్రవేశించింది. ఆ ప్రయాణీకులలో కదలిక కనబడింది. నగరంలో వారికి పరిచయమైన ప్రదేశాలను గుర్తించడములో నిమగ్నమయినారు. బాణం గురికి సూటిగావెళ్ళి గుచ్చుకున్నట్లుగా బస్సు డిపోలో ప్రవేశించింది.

రామారావు బస్సు దిగాడోలేదో, రిక్షావాళ్ళు అతని చుట్టుముట్టి అతని చేతులోనుండి బ్యాగును లాగుకో ప్రయత్నిస్తున్నారు. ఈ యుద్ధము చాలాసేపు జరిగేదే కాని, యీ లోపున చౌకీదారు రావడంతో రిక్షావాళ్ళు గేటు బయటకుపోయి దిగిన పాసెంజర్లకోసము ఎదురు చూడసాగారు. రామారావు నెమ్మదిగా స్టాండు బయటకు చేరారు. రిక్షావాళ్ళు అతని చుట్టూ గుమిగూడి, తమకు తోచిన బేరము చెప్పసాగారు. బస్‌స్టాండు వద్ద నుండే రిక్షావాళ్ళకు చాలా ఎక్కువ చార్జీలు వసూలు చెయ్యడము అనాదిగా వస్తున్న అలవాటు. హైదరాబాదుకు జిల్లాల నుండి కొత్తగా వచ్చే అమాయక ప్రయాణీకుల వద్ద నుండి మామూలు కంటె రెట్టింపు రాబట్టడానికి ప్రయత్నిస్తారు. హైదరాబాదు బస్‌స్టాండులో తెల్లవారఝామున దిగే ప్రయాణీకులకు యీ బెడద తప్పదు. సాధారణంగా, ఏ వూరి రైలు స్టేషను వద్దనైనా, బస్ స్టాండ్ వద్దనైనా యింతేనేమో.

రామారావు చూపు దూరంగావున్న మధ్య వయస్కుడైన రిక్షావానిపై పడింది. ఆతను యీ గొడవతో సంబంధము లేనట్లు పట్టనట్లుగా వున్నాడు. తన దగ్గిరకు వచ్చి అడిగినప్పుడే బేరంచేసుకొని వెళ్ళాలనుకున్నాడు గావును. రామారావు ఉద్దేశ్యం గ్రహించి దగ్గిరకు వచ్చి సామాను తీసుకున్నాడు. రామారావు చెప్పిన ప్రదేశము, యిస్తానని చెప్పిన రెండు రూపాయల చార్జీ విని అంగీకారమే నన్నట్లుగా తలవూపాడు.

రిక్షా జాంబాగ్ జంక్షన్ దాటింది. దీపాల మసక కాంతిలో రోడ్లు నిద్రపోతున్నట్లున్నాయి. చల్లని శీతగాలి శరీరాన్ని కొరుకుతోంది. రిక్షా ఆగింది. రిక్షావాడు దిగి, తన రొంటిని వున్న చుట్టను తీసి, చేతుల మధ్య దొర్లించి సాపుచేసి, నోట్లో పెట్టుకొని, రామారావు దగ్గిర అగ్గిపెట్టి తీసుకొన్నాడు. అగ్గిపుల్ల వెలుతురులో అతని స్ఫోటకపు మచ్చల ముఖము స్పష్టముగా కనబడింది.

"నీ పేరేమిటోయ్" అని అడిగాడు రామారావు.

"జంగయ్య బాబుగారు"

"మీరు ఎక్కడుంటారు?"

''పురానపూలు కాడ"

జంగయ్యకు ఒక దగ్గుతెర వచ్చి సంభాషణకు అంతరాయము కలిగించింది.

రామారావు రిక్షావానితో ఏదోవిధమైన సంభాషణ చేయాలనే ఉద్దేశ్యంతో వున్నాడు. నిశ్శబ్దంగా ప్రయాణించడము అతనికి బోరుగావుంది.

''రోజుకి ఎంత కిడుతుందేమిటోయ్"

'రోజూ ఏడెనిమిది రూపాయలు దొరుకుతాయి బాబు. ఓనాడెక్కువ ఓనాడు తక్కువ" రిక్షావాడు దగ్గుతూనే వున్నాడు.

రోజుకు ఎనిమిది రూపాయలంటే నెలకు రెండు వందల నలభై. ఫరవాలేదు. ఈ రోజులలో ఎమ్మే పాసయిన వాళ్ళకు కూడా అంతకన్న ఎవడెక్కువ యిస్తున్నాడు.

''దగ్గుతున్నావు కదా, మందే మయినా వేసుకొంటు న్నావా?"

"తిండి గింజలకే సాలంది మందు కేడొస్తుంది బాబు?"

''ఎంత మందేమిటోయ్ మీరు?"

''మా అమ్మ అయ్య సానా ముసిల్లోల్లండి. మా యింటిది ఆర్గురు పిల్లలు. మా తమ్ముడిప్పుడు యిడే గానే వుంటున్నాడండి''

''పదిమంది భోంచెయ్యాలి రెండు వందల నల భై లో. ఏమి జీవితము?" ఆశ్చర్యపడ్డాడు రామారావు.

"నాకు జీతమొస్తుంది దొరా! రెండు వందల ఏభై దాకా. తాసీలు ఆఫీసులో కొలువు పనిచేస్త" వచ్చే దగ్గును అణచుకున్నాడు జంగయ్య.

"నీవు మందు వాడాలోయ్. నీ ఆరోగ్యము సరిగా వున్నట్టు లేదు."

''వచ్చేది తిండికే సాలనపుడు మందు లేడనుంచి వస్తాయి దొరా! ఇపుడింటికిపోయి పండుతా. 9 గంట లకు లేచి గంజితాగి దఫ్తర్‌కు పోతే, మళ్ళీ యింటికి వచ్చేసరికి చీకటి పడిపోద్ది. రాత్రి తొమ్మిది గంటలకు రిక్షా మళ్ళా తీస్తా ''

రిక్షా వాని జీవిత ఆర్థిక సమస్యల గురించి రామా రావు ఆలోచిస్తున్నాడు. ''నీ తమ్ముడు ఉన్నాడన్నావు కదా! ఏమి చేస్తున్నాడు."

''అదంతా ఓ పెద్ద కథ బాబు. బడికి పంపినా, మీలాంటి పెద్ద దొరను బతిమలాడి యాడనే ఆఫీ సులో ప్యూను కొలువు యిప్పించినా! వాడి జీతము వాడి ఖర్చులకే సాలదు. సినిమాలు, హోటలు కర్చులు జాస్తి. ఇంటి కర్చులకు పైసా యివ్వడు...ఆడికి పెళ్ళిచేసినా. దానికి మార్వాడీ నుండి నాలుగువేలు తెచ్చినాను. మార్వాడి ఓడికి రెండు వందలు పైగా మిత్తి కట్టాలి నెలా"

"వడ్డీ అది మీ తమ్ముణ్ణి కట్టుకోమను. ఆ బాధ్యత అతనిదే''

"వాడిప్పుడు ఎవరి మాటింటాడు బాబు. మామ గారింట్లోనే మకాము. మాయింటికి రానేరాడు. అమ్మ నాన్నను కూడ వచ్చి పలకరించి పోనే పోడు." అన్నాడు జంగయ్య వ్యర్థమైన క్రోధముతో.

జీవితము జంగయ్య బుజాలపైపెట్టిన భారమేమిటో రామారావు గ్రహించాడు పరిస్థితులకు బానిసై, బాధ్యతలను తప్పుకోలేక - బీదరికము, బాధ్యత అనే రెండు చక్రాల మధ్య నలిగిపోయే అల్పజీవి. కడుపు నిండా తిండి, కంటినిండా నిద్రకు కూడా నోచుకోని దౌర్భాగ్యజీవి. రోజుకు నలభై ఎనిమిది గంటలు వున్నా నలభై ఎనిమిది గంటలు పనిచేసినా అతని కష్టాలకు అంతు లేదనిపిస్తుంది. రామారావు హృదయం సానుభూతితో ద్రవించింది.

"నా సొద నంతా చెప్పి బాబుగారి మనసు నొప్పించినాము. ఏదో బాబు మరి మరి అడుగుతుంటే

అంతా వెళ్ళబోసినా'' అని సంజాయిషి యిస్తున్నట్లుగా అన్నాడు జంగయ్య.

కాని జంగయ్య మాటలు రామారావు చెవులలో ప్రవేశించనే లేదు. అతను ఆలోచిస్తునే ఉన్నాడు. యిటువంటి నికృష్ట జీవనమును గడిపే జీవులు యీ భారతావనిలో యింకెందరున్నారో? ఎన్ని పంచవర్ష ప్రణాళికలు వేస్తే వాళ్ళ జీవనములో వసంతోదయ మవుతుంది? వారి కష్టాలకు అంతెక్కడ? వారి సమస్య లకు పరిష్కారమేమిటి?

'వచ్చేసినం దొరా' అని ప్రకటించాడు. జంగయ్య

"ఆ! అల్లాగా" అంటూ రిక్షా దిగాడు రామారావు. జేబు తడుముకున్నాడు. ఒక అయిదు రూపాయల కాగితముంది. దానిని బయటకు లాగి, జంగయ్య చేతిలో పెట్టి సంచీ తీసుకు నడవ సాగాడు.

"చిల్లర తీసుకొండి దొరా!" అన్న జంగయ్య మాటలు వెనుకనుండి రామారావుకు వినిపిస్తూనే వున్నాయి.

తెనుగు దివ్వె వెలిగించి
పెనుచీకటి తొలగించి
ఆసేతు హిమాచలం
ఆంధ్ర మొక్కటనిపించారు

- దాశరథి

'మరల నొకమాటు వెనుకకు మరలిచూచి
దిద్దుకోవమ్మ బిడ్డల తెనుగు తల్లి !

- కరుణశ్రీ